క్లుప్తంగా

గ్యాస్ ట్యాంకర్ బోల్తా



ఓజిలి: నెల్లూరు– చెన్నై జాతీయ రహదారిపై పెదపరియ క్రాస్ సమీపంలో బుధవారం ఉదయం గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడింది. గుజరాత్ నుంచి చెన్నైకు గ్యాస్‌లోడ్‌తో లారీ వెళుతోంది. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ప్రమాదం జరిగింది. అయితే గ్యాస్ లీక్ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

కాలువ కట్ట కింద మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దక్కిలి : మండల కేంద్రానికి సమీపంలో తెలుగు గంగ కాలువ కట్ట కింద ఓ వృద్ధుడి మృతదేహాన్ని బుధవారం ఆలస్యంగా గుర్తించారు. ఆ ప్రాంతంలో దుర్వాసన రావడంతో కట్టపై వాకింగ్ చేస్తున్న వారు అక్కడి ముళ్లపొదల్లో మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ శివ శంకర్ తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం మండలం అన్నంరాజుపల్లెకు చెందిన కోండూరు రవీంద్రరాజు (60)గా గుర్తించారు. మృతుడు రెండు రోజులు కిందట దేవునివెల్లంపల్లి స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో అవధూత గురుకల పోలయ్యస్వామి ఆరాధన మహోత్సవానికి వచ్చాడని, అతిగా మద్యం తాగడంతో మరణించి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

అక్రమ అరెస్ట్‌పై ఆగ్రహం

- భాకరాపేటలో భారీ ర్యాలీ.. నిరసన



గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

తిరుపతి రూరల్ : మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసు బనాయించి అప్రజాస్వామికంగా అరెస్ట్ చేసిందని, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డిపై సైతం కక్షగట్టిందని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడు మహాత్మా అంటూ.. బుధవారం భాకరాపేటలోని పార్టీ కార్యాలయం నుంచి గాంధీజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. చెవిరెడ్డి అరెస్ట్‌కు నిరసనగా నినాదాలు చేశారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి సీడీసీఎంస్ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి, ఎంపీపీ యుగంధర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సింహాల మోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. సహదేవరెడ్డి మాట్లాడుతూ చెవిరెడ్డి కుటుంబంపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, జగనన్న సైనికులను జైలుకు పంపి భయపెట్టాలని చూస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం సిట్ అధికారులు లిక్కర్ కేసులో తప్పులు మీద తప్పులు చేస్తున్నారని, దీనికి భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకుంటారని స్పష్టం చేశారు. ఎంపీపీ యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి ప్రజలను బిడ్డల్లా చూసుకున్న చెవిరెడ్డికి కష్టం వస్తే ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుడికే వచ్చినట్టు బాధపడుతున్నారని తెలిపారు. సింహాల మోహన్ మాట్లాడుతూ చెవిరెడ్డిపై ఎన్ని రకాలుగా అక్రమ కేసులు పెట్టినా, కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ యశోద, రామచంద్రాపురం జెడ్పీటీసీ సభ్యులు ఢిల్లీరాణి మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రజాస్వామ్యాన్ని చంపేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, భాకరాపేట సర్పంచ్ భూపాల్, యూత్ అధ్యక్షుడు మునిరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా

నేర నియంత్రణ

తిరుపతి క్రైమ్ : జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు పెంచి పకడ్బందీగా నేర నియంత్రణ చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జూన్‌కు సంబంధించి పోలీస్‌శాఖ పురోగతిని వివరించారు. ప్రతిరోజూ స్పెషల్ పార్టీ పోలీసులతో ముఖ్య పట్టణాల్లో గస్తీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రాత్రివేళల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న 1,837 మందిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వివరించారు. అలాగే సుమారు 18 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై 1,687 కేసులు నమోదు చేసి, కోర్టు ద్వారా జరిమానా విధించినట్లు తెలిపారు. 297 మంది వాహనదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ క్రమంలోనే రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 1,969 మంది చిరు వ్యాపారులపై న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు పెట్టినట్టు వెల్లడించారు. శాంతిభద్రతల రక్షణే లక్ష్యంగా జిల్లాలోని 314 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వివరించారు.

స్వర్ణ నారావారిపల్లె అభివృద్ధికి ప్రణాళికలు

అధికారులతో సమీక్షించిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: స్వర్ణ నారావారిపల్లి–2029 అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ స్వర్ణ నారావారిపల్లి అభివృద్ధికి ఇప్పటి వరకు చేపట్టిన అంశాలు, చేయాల్సిన పనులపై ప్రత్యేక అధికారి, డీపీఓ సుశీలాదేవిని ప్రశ్నించారు. ఆమె చేపడుతున్న పనులను వివరించారు. బ్యాంక్ లింకేజ్ ద్వారా స్వయం సహాయ సంఘాలకు రుణాల మంజూరు, వ్యవసాయ రంగానికి సంబంధించి కిచెన్ గార్డెనింగ్, టెరస్ గార్డెనింగ్‌పై గుర్తించిన కుటుంబాలకు శిక్షణ ఇవ్వడం, రైతుల పొలాల్లో కిట్ల ఏర్పాటు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ వివరించారు. డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్, సీపీఓ వెంకటేశ్వర్లు, పశుసంవర్ధకశాఖ ఏడీ ప్రసాద్, మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారి సతీష్, మార్కెటింగ్ ఏడీ సురేంద్రబాబు, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నరేంద్రబాబు, సివిల్ సప్లయీస్ జిల్లా అధికారి శేషాచలం రాజు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు కన్నీటి వీడ్కోలు



చిట్టిబాబును పరామర్శిస్తున్న నేతలు

నాయుడుపేటటౌన్ : దుబాయ్‌లో ప్రమాదవశాత్తు గాయపడి చికిత్సపొందుతూ శనివారం కన్నుమూసిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మదిరి మునిరత్నం(36) మృతదేహం బుధవారం సాయంత్రం నాయుడుపేటకు చేరింది. బలిజ ఐక్యవేదిక నేత మదిరి చిట్టిబాబు పెద్ద కుమారుడైన మునిరత్నం భౌతికకాయానికి పెద్దసంఖ్యలో స్థానికులు నివాళులర్పించారు. బంధుమిత్రుల రోదనల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. చిట్టిబాబును వైఎస్సార్‌సీపీ నేతలు పరామర్శించారు.

వీసీ కోసం వెతుకులాట!

- ఎస్వీయూ వైస్ చాన్సలర్ నియామకానికి సెర్చ్ కమిటీలు



ఎస్వీయూ పరిపాలన భవనం

తిరుపతి సిటీ : ఎస్వీయూ వీసీ నియామకంపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఏడాదిగా పూర్తి స్థాయి వైస్ చాన్సలర్‌ను నియమించేందుకు ఇప్పటికే రెండు సార్లు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఇటీవల సమావేశమైన రెండో సెర్చ్ కమిటీ ఓ మంత్రి తోడల్లుడు సిఫార్సు చేసిన రెండు పేర్లతో పాటు ప్రస్తుత ఇన్‌చార్జి వీసీ పేరును ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీనిపై తమ వారిని పక్కన పెట్టారని కూటమిలో భాగమైన ఓ ప్రధాన పార్టీ నేత మండిపడ్డట్టు సమాచారం. ఈక్రమంలో వీసీ నియామక ప్రక్రియ సందిగ్ధంలో పడింది. మొదటి, రెండో సెర్చ్ కమిటీ సమర్పించిన నివేదికలను రద్దు చేసి ప్రస్తుతం మరోసారి మూడో సెర్చ్ కమిటీని నియమించేందుకు ఉన్నత విద్యామండలి కసరత్తు ప్రాంభించినట్లు విశ్వసనీయ సమాచారం.

ఒత్తిడిలో కమిటీలు

ప్రధానంగా ఎస్వీయూ వీసీ నియామకంపై ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీలపై రాజకీయ ఒత్తిడి అధికంగా ఉన్నట్లు తెలిసింది. అందుకే సెర్చ్ కమిటీలో సభ్యులుగా తమను ఎంపిక చేయవద్దని పలువురు ఉన్నత విద్యామండలి అధికారులకు మొరపెట్టుకుంటున్నట్లు సమాచారం. ప్రతిభ, అనుభవం, సామాజిక వర్గ సమీకరణల ప్రాతిపదికన వీసీ నియామకానికి సమర్థులైన ముగ్గురు వ్యక్తులను సెర్చ్ కమిటీ ప్రతిపాదిస్తే వాటిని రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని విద్యావంతులు, మేధావులు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఇప్పట్లో ఎస్వీయూకు పూర్తి స్థాయి వీసీ నియామకం జరిగేలా లేదని పలువురు చర్చించుకుంటున్నారు.

బాబు మోసాలను ఎండగడదాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరుణాకర రెడ్డి, నారాయణ స్వామి, కృపాలక్ష్మి తదితరులు

కార్వేటినగరం : ఎన్నికల ముందు చంద్రబాబు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉమ్మడి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గం స్థాయిలో 49 కొత్తపల్లిమిట్టలో దీపికా కళ్యాణ మండపంలో రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో, బాబూ ష్యూరిటీ...మోసం గ్యారంటీపై వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో క్యూ ఆర్ కోడ్‌ను ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామితో పాటు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల ముందు 18 ఏళ్ల నుంచి 50 సంవత్సరాల మహిళలందరికీ ప్రతి నెలా రూ.1,500 చొప్పున ఇస్తామన్న బాబు అధికారంలోకి వచ్చాక మోహం చాటేశారన్నారు. పింఛను పథకాన్ని గొప్పగా చెప్పుకుంటున్న బాబు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన వాటి కంటే ఒక్క కొత్త పింఛను అయినా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు కార్యక్రమం చేపట్టాక కిందకి దిగొచ్చి అరకొరగా తల్లికి వందనం పథకం అమలు చేశారన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 87 లక్షల మంది విద్యార్థులకు రూ. 13,500 కోట్లు అవసరముంటే కేవలం రూ. 8,000 కోట్లు విడుదల చేశారని దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తే ఇన్ని డబ్బులోస్తాయని ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు బాండ్లు పంచారని, హామీలు అమలు చేయకపోతే కాలర్ పట్టుకొని అడగాలని చంద్రబాబు కుమారుడు లోకేష్ చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు గ్రామాల్లోకి వెళ్తే అన్ని వర్గాల వారు కూటమి ప్రజా ప్రతినిధుల కాలర్ పట్టుకోవడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రజలందరికీ గుర్తు చేయడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ప్రకటించారు.

2019–24 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. 5 ఏళ్ల పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని పదేళ్లు ముందుకు తీసుకెళితే చంద్రబాబు ప్రస్తుత ఏడాది పాలనలో రాష్ట్రాన్ని 15 ఏళ్ల వెనక్కి నెట్టేశారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మణి, వెంకటరామిరెడ్డి, శేఖర్ రాజు, విజయకుమార్, పద్మనాభరెడ్డి, తులసియాదవ్, ఎంపీపీ హేమలతారెడ్డి, జడ్పీటీసీలు సుకుమార్, అన్బుఅళగన్, సర్పంచ్ డిల్లెయ్య, ఎంపీటీసీ కోటిరెడ్డి బాబు, నాయకులు హేమసుందర్‌రెడ్డి, విజయబాబు, ధనంజయవర్మ, చందురాజు, కుప్పయ్య, జనార్దన్, యశోదారెడ్డి, నారాయణరెడ్డి, దూది మోహన్, హరిబాబు, రాజశేఖర్‌రెడ్డి, శ్యామ్ పలువురు పాల్గొన్నారు.

కొలువుల కోత

- రేషనలైజేషన్ పేరుతో సచివాలయాల కుదింపు
- ప్రశ్నార్థకంగా ఉద్యోగుల భవిత
- ప్రభుత్వ వైఖరిపై సిబ్బంది ఆగ్రహం



సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు(ఫైల్)

తిరుపతి అర్బన్ : క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం, సత్వరమే సేవలు అందించే సచివాలయ వ్యవస్థపై ప్రభుత్వం కక్షగట్టింది. రేషనలైజేషన్ పేరుతో ఉద్యోగుల మెడపై కత్తి పెట్టింది. ఈ మేరకు జిల్లాలోని 691 సచివాలయాలను 353కి తగ్గించింది. అదే క్రమంలో 5,625 మంది సిబ్బందికి గాను 3,650 మందికి మాత్రమే ప్రస్తుత బదిలీల్లో పోస్టింగ్ ఇచ్చింది. మిగిలిన 1,975 మంది సచివాలయ సిబ్బంది భవితను ప్రశ్నార్థకంగా మార్చేసింది.

ఉద్యోగుల తగ్గింపు!

సచివాలయాల్లోని ఒక్కో విభాగంలో 30 నుంచి 80 మంది ఉద్యోగులను తగ్గించినట్లు తెలుస్తోంది. ఒక్కో సచివాలయంలో 30 విభాగాలకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. వీరిలో భారీగా కోత విధించినట్లు సమాచారం. తాజాగా నిర్వహించిన బదిలీల్లో వారికి పోస్టింగ్ ఇవ్వలేదు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే రేషనలైజేషన్ నేపథ్యంలో ఖాళీలు లేవని... ఏదో ఒకచోట సర్దుబాటు చేస్తామని చెబుతున్నారు. అప్పటి వరకు వారంతా రిజర్వులోనే ఉండాల్సిన దుస్థితి దాపురించింది.

నిబంధనలకు నీళ్లు

ఇటీవల చేపట్టిన బదిలీల్లో నిబంధనలకు నీళ్లు వదిలేశారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పోటీ పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించి ఉద్యోగాలు పొందామని గుర్తు చేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం కూటమి నేతల సిఫార్సు ఉన్నవారికి మాత్రమే పోస్టింగ్ ఇచ్చారని ఆరోపిస్తున్నారు. అలాగే లంచాలు ముట్టజెప్పిన వారికి సైతం ప్రాధాన్యమిచ్చారని మండిపడుతున్నారు. మిగిలిన వారిని పట్టించుకోకుండా రిజర్వులో పెట్టేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వేతనం కూడా నిలిపేసే ప్రమాదముందని, తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయకుంటే కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు.

జిల్లా సమాచారం

డివిజన్	గతంలో సచివాలయాల సంఖ్య	ప్రస్తుతం
తిరుపతి	245	125
శ్రీకాళహస్తి	154	82
సూళ్లూరుపేట	137	68
గూడూరు	155	78
మొత్తం	691	353

బడి కోసం..ఆగని పోరాటం



నారాయణవనంలో ధర్నా నిర్వహిస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

నాయుడుపేటటౌన్ : పేద విద్యార్థులకు చదువును దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదలు విద్యాభ్యాసం చేసే ప్రాథమిక పాఠశాలలను మోడల్ బడుల్లో విలీనం చేసేందుకు తెగబడుతోందని మండిపడ్డారు. బుధవారం ఈ మేరకు నాయుడుపేట చంద్రబాబు నాయుడు కాలనీలోని బడిలో ఉన్న 3,4,5 తరగతులను చదివే విద్యార్థులను తుమ్మూరు మోడల్ పాఠశాలలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై నిరసన తెలిపారు. బడికి తాళం వేసి ఆందోళన చేపట్టారు. ప్రధానోపాధ్యాయిని ప్రేమలీలను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ మునిరత్నం హుటాహుటిన పాఠశాలకు చేరుకుని తల్లిదండ్రులతో మాట్లాడారు. నచ్చజెప్పి పాఠశాలకు తాళం తీయించారు. ఈ సందర్భంగా స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ నిర్మల మాట్లాడుతూ 25 మంది విద్యార్థులను తుమ్మూరులోని పాఠశాలకు పంపడం దారుణమన్నారు. రైలు పట్టాలు దాటుకుని పిల్లలు అంత దూరం వెళ్లలేరని స్పష్టం చేశారు.

హైవేపై ధర్నా

నారాయణవనం: మా పిల్లలు మా ఊరి బడిలోనే చదవాలంటూ బుధవారం మండలంలోని ఇప్పన్‌తాంగాళ్ దళితవాడ పాఠశాల పిల్లలు, తల్లులు జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. 14 మంది విద్యార్థులను 3 కిలోమీటర్ల దూరంలోని టీకే పాళ్యం మోడల్ స్కూల్‌కు పంపడానికి ఒప్పుకోమంటూ స్పష్టం చేశారు. బీఎస్పీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి ధనుంజయ మాట్లాడుతూ బడుల విలీన నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేవారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

తిరుపతి మంగళం : రవాణా, పోలీస్ శాఖల నిబంధనలను ఉల్లంఘించి వాహనాలకు నంబర్ ప్లేట్లు పెట్టుకుంటే చర్యలు తప్పవని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. బుధవారం తిరుమలలో రవాణా, ట్రాఫిక్ పోలీసులు వాహన నంబర్ ప్లేట్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇష్టారాజ్యంగా నంబర్ ప్లేట్లు పెట్టుకున్న 22 వాహనాలకు రూ. 1.31లక్షల జరిమానా విధించారు. రవాణాశాఖ అధికారి మాట్లాడుతూ నంబర్ ప్లేట్లపై వాహన నంబర్లను ఎలా పడితే అలా వేసుకుంటున్నారని, అలాగే వివిధ ఫొటోలను అంటించుకుంటున్నారన్నారు. నిబంధనల ప్రకారం వాహనాలపై అలాంటివి ఉండకూడదని సూచించారు. మోటారు వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, మోహన్‌కుమార్, వెంకటరమణనాయక్, ట్రాఫిక్ సీఐ హరప్రసాద్ పాల్గొన్నారు.

నిషేధిత హారన్ వినిపిస్తే చర్యలు

తిరుపతి క్రైమ్ : జిల్లాలో నిషేధిత సౌండ్ హారన్ వినిపిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు, బస్సులు, లారీలు తదితర వాహనాలు ఏవైనా సరే నిబంధనలకు అనుగుణంగా హారన్ అమర్చుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు 8099999977 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంవగా డీఎస్పీ రామకృష్ణ ఆచారి ఆధ్వర్యంలో తిరుమల జీఎం టోల్‌గేట్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సుమారు 45 వాహనాలు తనిఖీ చేసి, 22 వాహనాలకు రూ.1.31 లక్షల జరిమానా విధించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

జూనియర్ అండర్–21 అండ్ సీనియర్ సౌత్ ఆసియా కరాటేలో ఎంపికై శ్రీలంకలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్న హోంగార్డు కుమారుడిని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించారు. ఎస్పీ కార్యాలయంలో హోంగార్డుగా పని చేస్తున్న కిషోర్ కుమారుడు సూర్య పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 3 నుంచి శ్రీలంకలో జరిగే కరాటే చాంపియన్ షిప్‌కు హాజరుకానున్నాడు. ఈ నేపథ్యంలో విద్యార్థికి ప్రోత్సాహకంగా ఎస్పీ రూ.50వేలను వెల్ఫేర్ ఫండ్ నుంచి అందించారు.



విద్యార్థికి చెక్ అందిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

పచ్చనేతను వదిలేసి.. పక్కనోళ్లపై కేసు

చంద్రగిరి : మండలంలోని జరిగిన ఓ దాడి కేసులో అసలు సూత్రధారి అయిన పచ్చనేతను పోలీసులు వదిలేసి, ఆయనతో కలిసి వెళ్లిన వారిపై కేసు నమోదు చేయడం చర్చనీయాంశమైంది. వివరాలు.. సోమవారం ఏ.రంగంపేటలో మద్యం దుకాణం వద్ద స్థానిక టీడీపీ నేతకు, నారావారిపల్లెలోని మరో నేతకు గొడవ జరిగింది. ఈ క్రమంలో ఏ.రంగంపేటకు చెందిన టీడీపీ నేతను ఆయన ఇంటికే వెళ్లి, నారావారిపల్లెకు చెందిన నేత బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో పగ పెంచుకున్న రంగంపేట టీడీపీ నేత, కొంత మంది యువకులతో కలసి నారావారిపల్లెలోని టీడీపీ నేత ఇంటికి వెళ్లి దాడికి దిగారు. దీంతో ఆ నేత దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే గొడవకు ప్రధాన కారణమైన ఏ.రంగంపేట టీడీపీ నేతను ఫిర్యాదులో తప్పించి, ఆయన వెనుక వెళ్లిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయడంపై బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు వారిని వదిలేసి, అమాయకులపై పోలీసులు కేసు నమోదు చేయడంపై మండిపడుతున్నారు.

నేటి నుంచి తిరుపతి ఐఐటీలో అంతర్జాతీయ సదస్సు

ఏర్పేడు : ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ అండ్ స్ట్రక్చర్స్‌పై గురువారం నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఐఐటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సు జరగనుంది. నిర్మాణ రంగం మెటీరియల్, టెక్నాలజీ, హెల్త్ మానిటరింగ్, రెట్రోఫిట్టింగ్, స్మార్ట్ టెక్నాలజీపై ఈ సదస్సులో చర్చించనున్నారు.

మృతుని కుటుంబానికి సిపాయి భరోసా



సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: మృతుడు సోమయ్య కుటుంబానికి సిపాయి భరోసా పథకం కింద నిత్యావసరకులు అందజేశారు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన సోమయ్య ఇటీవల మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం బుధవారం గ్రామానికి చేరుకుని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వారికి సిపాయి భరోసా నుంచి నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రత్నంరెడ్డి, బాలాజీరెడ్డి, భరత్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లైఫ్ స్కిల్స్‌తో సమస్యలను ఎదుర్కొనే సత్తా


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ ఉమ

తిరుపతి సిటీ: విద్యార్థి దశ నుంచి లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కలిగి ఉండే జీవితంలో ఎదురయ్యే సమస్యలను దీటుగా ఎదుర్కోగలరని మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ అన్నారు. వర్సిటీలో లైఫ్ స్కిల్స్‌పై బోధన సిబ్బందికి మూడు రోజుల శిక్షణ బుధవారం ముగిసింది. వీసీ మాట్లాడుతూ, 8వ తరగతి నుంచి పాఠ్యాంశాలలో జీవన నైపుణ్యాల గురించి పొందుపరచడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. శిక్షణ పొందిన అధ్యాపకులు వర్సిటీలో విద్యార్థినులకు శిక్షణ ఇచ్చి వారిలో జీవన నైపుణ్యాలను పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ డాక్టర్ సంజీవ్ కుమార్, డీన్ ప్రొఫెసర్ సీ.వాణి, డాక్టర్ జీ.శిరీష, డాక్టర్ వజిహాభాను, అధ్యాపకులు పాల్గొన్నారు

కార్మిక కోడ్లు రద్దు చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

పాకాల: కార్మిక కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్‌రావు, మండల కన్వీనర్ ప్రసాద్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కార్మికులపై అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ 9వ తేదీ పాకాలలో సమ్మె చేయనున్నట్టు చెప్పారు. కార్మిక కోడ్లు అమలైతే పని గంటలు పెంచుతారని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని కార్మికులు సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఆనందరాజు, శేఖర్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మస్తాన్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు స్పందన


అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: స్థానిక కొత్తవీధిలోని తమ సంఘ కార్యాలయంలో ఆర్యవైశ్య సంఘం బుధవారం నిర్వహించిన ఉచిత మెగా జాబ్ మేళాలో 50 మంది ఉద్యోగావకాశాలు పొందారని ఆ సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి వందమందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. జాబ్ మేళాలో పేటీఎం, హైదరాబాద్‌కు చెందిన జప్తో కంపెనీ, రిపోర్డెడ్ రిటైర్డ్ సంస్థ, అపోలో సంస్థల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. ఎంపికైన వారికి సంఘం ప్రతినిధులు, ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ అధికారిణి స్నేహ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి శ్రీధర్, హేమచంద్రకుమార్, కోశాధికారి మధు, సురేష్, సుకుమార రామ్మూర్తి, వివిధ కంపెనీల ప్రతినిధులు కిషోర్, రాజు, వాసు పాల్గొన్నారు.

మందుబాబులకు జైలు, జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపిన ఎనిమిది మంది డ్రైవర్లకు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, ఒక్కొక్కరికి పదివేల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. కోర్టు కానిస్టేబుల్ శివుడు తెలిపిన వివరాలు మేరకు....తిరుపతిలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అధిక మొత్తంలో మద్యం తాగి ఆటో, నాలుగు చక్రాల వాహనాలు నడుపుతున్న ఎస్. మహమ్మద్, కె.వెంకటేష్, సి.చరణ్ కుమార్, ఎస్.సుబ్రహ్మణ్యం, సి.కాశి, టి.విజయ్, ఎం. యువరాజ్, పి.ధనశేఖర్ లను పోలీసులు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. అలాగే తక్కువ మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందికి సైతం పదివేల చొప్పున చొప్పున జరిమానా విధించారు.

విషజ్వరంతో బాలిక మృతి



చంద్రగిరి : విషజ్వరం కారణంగా బాలిక మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. చంద్రగిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన జాస్మిన్(16)కు చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందారు. దీంతో బాలిక తన పెద్దమ్మ సంరక్షణ ఉంటోంది. ఈ క్రమంలో వారం క్రితం బాలికకు టైఫాయిడ్ జ్వరం వచ్చింది. తిరుపతి రుయాలో చికిత్సను చేయించి మంగళవారం ఇంటికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం బాలికలకు మూర్ఛ రావడంతో హుటాహుటిన స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆస్పత్రికి వెళ్లి బాలిక మరణానికి గల కారణాలను నమోదు చేసుకున్నారు.

బరితెగించిన ‘పచ్చ’ బకాసురులు..!

ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు కూటమి నాయకులు భూ బకాసురుల అవతారం ఎత్తుతున్నారు. కోట్ల విలువైన భూమికి నకిలీ పత్రాలను సృష్టించి అప్పనంగా కాజేస్తున్నారు. ఆపై ప్లాట్లుగా వేసి దర్జాగా జేబులు నింపుకుంటున్నారు. సాక్షాత్తు తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైనా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.


సి.రామాపురం గ్రామ లెక్క దాఖలా సర్వే నంబరు 28లోని ప్రభుత్వ భూమిలో లేఔట్ వేస్తున్న కబ్జాదారులు

- రామాపురంలో 5 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసి లేఔట్
- రూ.20 కోట్ల విలువైన భూమి కొట్టేసిన అక్రమార్కులు
- అధికార పార్టీ నేతలు, అధికారులకు భారీగా ముడుపులు
- ఆందోళనలకు సిద్ధమవుతున్న రామాపురం వాసులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రామచంద్రాపురం మండలం సి.రామాపురం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 28లోని 105 ఎకరాల గుట్ట, దరఖాస్తు భూములపై అధికార పార్టీకి చెందిన తెలుగు తమ్ముళ్ల గద్దల్లా వాలిపోయారు. ఇప్పటికే గుట్టను చదును చేసి చాలా వరకు అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు ఏ చర్యలూ తీసుకోలేదు. దీంతో సుమారు రూ.20కోట్లు విలువైన 5 ఎకరాల భూమిని చదును చేసి, లేఔట్ వేసి, ప్లాట్లుగా మార్చి అమ్మకాలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

ఆక్రమిత భూమిలో అందరికీ వాటాలు

రూ.20కోట్ల విలువైన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, లేఔట్ వేయడమే కాకుండా తిరుపతి–రామచంద్రాపురం మార్గానికి ఆనుకుని కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ కూడా నిర్మాణం చేస్తుండడంతో కబ్జాదారులకు అధికారుల అండ ఏ రీతిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఆక్రమణదారుల నుంచి అందరికీ వాటాలు చేరినట్టు గ్రామస్తుల ఆరోపణ. టీడీపీకి చెందిన వారికి 50శాతం, రెవెన్యూ అధికారులకు 25శాతం, ఆక్రమణలపై అడ్డుతగిలే వారికి 25శాతం మేరకు వాటాలు ముట్టచెప్పారని ప్రచారంలోకి వచ్చింది. అధికారులు గుట్టుగా రికార్డులు మార్చేసి కబ్జా దారులకు అనుభవం కల్పించినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల సరిహద్దుల్లో వున్న ఈ భూమికి డిమాండ్ ఉండటంతో కబ్జా దారులు పక్కాగా స్కెచ్ వేసి ఆక్రమించినట్టు చెబుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌తో పాటు సీఎం కార్యాలయానికి లేఖలు రాస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ప్రత్యక్ష ఆందోళనలకు పూనుకుంటామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.


ఆక్రమిత భూమిలో అక్రమంగా నిర్మించిన ఇళ్లు


కోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో అడ్డగోలుగా నిర్మిస్తున్న అక్రమార్కులు

పుష్పయాగం..భక్తి పారవశ్యం


శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి పుష్పయాగం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పలు రకాల పుష్పాలతో పుష్పయాగం ఘనంగా నిర్వహించారు. ఈ పుష్పాలను ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దాతలు విరాళంగా అందజేశారు. పుష్పయాగం అనంతరం సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఏఈఓ గోపినాథ్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు. - తిరుపతి కల్చరల్

వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

తిరుపతి తుడా: నగర పరిధిలో అర్హులైన వీధి విక్రయదారులు గుర్తించి నగరపాలక సంస్థ తరపున గుర్తింపు కార్డులు ఇస్తామని కమిషనర్ ఎస్.మౌర్య ప్రకటించారు. వీధి విక్రయదారులను గుర్తించడం, నిబంధనలపై వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీలు, ఆర్పీలు బుధవారం కచ్చపి ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి విక్రయదారులపై సర్వే రెండు మూడురోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికీ సర్వేలో నమోదు కాని వీధి విక్రయదారులను సంబంధిత వార్డ్ వెల్ఫేర్ సెక్రెటరీ, ఆర్పీలతో నమోదు చేయించాలన్నారు. సర్వే పూర్తయ్యాక వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులిస్తామన్నారు. గుర్తింపు కార్డుల కోసం రూ.200 ఇండియన్ బ్యాంకు టౌన్ వెండింగ్ కమిటీ, తిరుపతి ఎస్‌బీ 8074122243 అకౌంట్‌కు జమ చేయాలన్నారు. అనంతరం జోన్లను ఏర్పాటు చేస్తామని, గ్రీన్ జోన్‌లో పూర్తిగా వ్యాపారం చేయడానికి, అంబర్ జోన్‌లో నిర్దిత సమయం వరకు మాత్రమే వ్యాపారం చేయడానికి అనుమతిస్తామని, రెడ్ జోన్‌లో పూర్తిగా వ్యాపారం చేయరాదన్నారు. గుర్తింపు పొందిన వీధి విక్రయదారులు ఎలాంటి రుసుము ఎవరికీ చెల్లించనవసరం లేదన్నారు. తాము మంజూరు చేసిన గుర్తింపు కార్డు మాత్రమే చెల్లుబాటు అవుతాయని, ప్రైవేటు వ్యక్తులు మంజూరు చేసిన ఐడీ కార్డులు చెల్లవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మెప్మా సీఎంఎంలు కృష్ణవేణి, సోమ కుమార్, సీఓలు, స్ట్రీట్ వెండర్స్ యూనియన్ నాయకులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండండి..అండగా ఉంటాం..!



బాధితుడు అజయ్ కుమార్‌ను ఫోన్‌లో పరామర్శించి, ధైర్యం చెబుతున్న చెవిరెడ్డి హర్షిత్, సర్పంచ్ భారతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ, పార్టీ నాయకులు

చంద్రగిరి: మీరు ధైర్యంగా వుండండి.. మీ కుటుంబానికి మేం అండగా ఉంటాం.. మీపై దాడి చేసిన వారినెవరినీ వదిలేది లేదు.. పోలీసులు అజయ్ కుటుంబంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి... ఏకపక్షంగా వ్యవహరిస్తే పోలీసులపై ప్రైవేటు కేసులు పెడదాం.. ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదు..‘‘ అని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అజయ్ కుటుంబీకులకు భరోసా ఇచ్చారు. మండలంలోని వైఎస్‌ఆర్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు అజయ్, అతని కుటుంబంపై టీడీపీ నేతలు దాడులు చేయించి తీవ్రంగా గాయపరచడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అజయ్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. విజయవాడ నుంచి రాగానే పోలీసులను కలుస్తామని, దాడి ఉదంతంపై ఆందోళనలు చేస్తామంటూ పైవిధంగా ధైర్యం చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ

చంద్రగిరి: పచ్చమూకల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ మద్దతురాలు, ఎం.కొంగరవారిపల్లె సర్పంచ్ భారతి, దామోదర్ నాయుడు, వారి కుమారుడు భార్గవ్‌ను బుధవారం ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ దేవారెడ్డి పరామర్శించారు. చంద్రగిరిలోని వారి ఇంటికి వెళ్లి మాట్లాడారు. దాడికి గల కారణాలను తెలుసుకున్నారు. కూటమి పాలనతో నిత్యం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవంలో ఇలాంటి సంస్కృతి ఎప్పుడూ చూడలేదని, ఇకనైనా కూటమి ప్రభుత్వం దాడులకు స్వస్తి పలకాలని హితవు పలికారు.

గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న విహారం


నాలుగు మాడవీధులలో గరుడ వాహనంపై విహరిస్తున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సాక్షాత్కార వైభవోత్సవాలలో బుధవారం సాయంత్రం గరుడ వాహనంపై స్వామి వారు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తొలుత ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, వివిధ కైంకర్యాలు అనంతరం 11 గంటలకు ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు శ్రీవారికి ఉయ్యాలసేవ నిర్వహించారు. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీవారు తనకు ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై ఆశీనులై ఆలయ మాడ వీధుల్లో విహరించారు. ఇదలా ఉంచితే, గురువారం పారువేట నిర్వహించేందుకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు స్వామివారికి తిరుప్పావడ సేవ.
- స్విమ్స్ వద్ద ఉదయం 10 గంటలకు స్విమ్స్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు
- మహిళా యూనివర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా సంస్థ కాన్వొకేషన్ వేడుకలు.
- తిరుచానూరులోని శ్రీసూర్యనారాయణస్వామి ఆలయంలో సాయంత్రం 5 గంటలకు తిరుచ్చి ఉత్సవం.
- తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న శ్రీనివాసం, రైల్వేస్టేషన్ వద్దనున్న విష్ణు నివాసం, అలిపిరి వద్దనున్న భూదేవి కాంప్లెక్‌లో తిరుమలకు శ్రీవారిమెట్టు నడక మార్గంలో వెళ్లే భక్తులకు మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి ఉచిత దర్శనం టోకెన్లు పంపిణీ.

నిరసన వినూత్నం


నుదుట నామం...చెవిలో పువ్వుతో నిరసన వ్యక్తం చేస్తున్న స్విమ్స్ కార్మికులు

తిరుపతి తుడా: స్విమ్స్ ఆసుపత్రి ప్రాంగణం కార్మికుల నిరసనలతో హోరెత్తుతోంది. కార్మికులు వేతనాలు పెంచాలని, హోదాను మార్చాలని చేస్తున్న ఆందోళన రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. బుధవారం గంట పాటు విధులు బహిష్కరించిన కార్మికులు నుదుట నామాలు... చెవిలో పువ్వులతో..తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించండి గోవిందా! అంటూ నినదించారు.

చిరు వ్యాపారులపై టీటీడీ అధికారుల దాడి

– వారిపై చర్యలు తీసుకోవాలి: సీఐటీయూ డిమాండ్


దాడిలో గాయపడిన బాధితుల దృశ్యాలను ప్రదర్శిస్తున్న సీఐటీయూ నేత, చిరు వ్యాపారులు

తిరుపతి కల్చరల్: పొట్టకూటి కోసం వ్యాపారం చేసుకుంటున్న శ్రీవారిమెట్టు చిరు వ్యాపారులపై 3, 5వ సెక్టార్ ఏవీఎస్‌ఓలు, టూ టౌన్ సీఐ తమ సిబ్బందితో మంగళవారం దాడి చేసి గాయపరచడం దుర్మార్గమని, దాడికి పాల్పడిన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర డిమాండ్ చేశారు. బాధితులైన చిరువ్యాపారులతో కలిసి ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన దాడిలో గాయపడిన దృశ్యాలను ప్రదర్శించి మాట్లాడారు. శ్రీవారిమెట్టు చిరు వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని, వారికి లైసెన్సులు ఇవ్వాలని కోరుతూ 317 రోజులుగా టీటీడీ పరిపాలన భవనం వద్ద నిరసన దీక్షలు చేస్తున్నామన్నారు. వారికి న్యాయం చేయాలని ఇటీవల తాము టీటీడీ చైర్మన్‌కు విజ్ఞప్తి చేయడంతో ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఆయన హామీ ఇచ్చిన రెండ్రోజుల్లోనే ఏవీఎస్‌ఓ శైలేంద్ర, తిరుమల టౌన్ సీఐ శ్రీరాములు తమ సిబ్బందితో వెళ్లి చిరు వ్యాపారులపై దాడులు చేయడమే కాకుండా వారి నుంచి డబ్బులు, సెల్‌ఫోన్లు, మోటార్ వెహికల్స్‌ను తీసుకెళ్లారని తెలిపారు. వీరి దాడిలో మోహన్, ప్రకాష్, శ్రీనివాసులు, డి.భార్గవ్, శేఖర్ తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో చిరు వ్యాపారులు యుగంధర్, మధు, చిట్టిబాబు, రెడ్డి శేఖర్, నరసింహులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తే ఎస్మా ప్రయోగిస్తాం

- విధుల నుంచి తొలగింపు తథ్యం
- కార్మికులను రెచ్చగొట్టిన వారిపైనా చర్యలు
- స్విమ్స్ డైరెక్టర్ హెచ్చరిక

తిరుపతి తుడా: స్విమ్స్‌లో కార్మికులు ఆందోళ కొనసాగిస్తే ఎస్మా ప్రయోగించి ఉద్యోగాల నుంచి తొలగిస్తామని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన ఒక ప్రకటనతో పాటు వీడియో సందేశాన్ని విడుదల చేశారు. స్విమ్స్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మి శ్రీనివాస కార్పొరేషన్‌లోని కాంట్రాక్ట్ ఉద్యోగులు కొంత కాలంగా పలు రకాల కోరికలను కోరుతూ విధులను బహిష్కరించేందుకు సిద్ధపడుతున్నారని, టీటీడీ సామరస్యంగా పరిష్కరించాలని ఉందన్నారు. సదరు ఉద్యోగులు సంబంధిత శాఖాధిపతులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. స్విమ్స్‌లో ఎస్మా చట్టం అమలులో ఉందని, ఈ తరుణంలో సమ్మె నోటీసు ఇవ్వడం చట్టవిరుద్ధమన్నారు. వైద్య సేవలకు ఆటంకం కలిగిస్తే విధుల నుంచి తొలగించే నిబంధన ఉందన్నారు. విధులను బహిష్కరించి సమ్మెకు దిగితే ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. స్విమ్స్‌తో సంబంధం లేని బయట వ్యక్తుల ప్రమేయంతో ఆందోళనలు, నిరసనలకు దిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఒకసారి ఉద్యోగం నుంచి తొలగించాక మళ్లీ తీసుకునే ప్రసక్తే ఉండదనేది గుర్తెరగాలని హితవు పలికారు.

రూ.60కోట్లతో అభివృద్ధి పనులు


తిరుపతి తుడా: ఏడాది కాలంలో నగరంలో రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. 33, 9వ డివిజన్ల పరిధిలోని అబ్బన్న కాలనీలో మారుతీనగర్ పరిధిలో 19.25 లక్షలతో నిర్మించిన యూజీడీ లైన్, సీసీ డ్రైన్, రోడ్లను ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, కార్పొరేటర్లతో కలసి ప్రారంభించి మాట్లాడారు.రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని డ్రైయిన్లలో షిల్ట్ తీసి నీరు నిల్వకుండా చూస్తామని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ, ఎక్కువగా ప్రజల నుంచి భూగర్భ డ్రైనేజీ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు.

మురుగు కాలువల్లో చెత్త వేయకండి

నగరంలోని మురుగు కాలువల్లో చెత్త వేయవద్దని, ఇళ్ల వద్దకు వచ్చే తమ సిబ్బందికి ఇవ్వాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని 2, 3వ వార్డులో ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై బుధవారం ఉద యం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి కమిషనర్ పరిశీలించారు. డ్రైనేజీ కాలువల్లో చెత్త ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. కాలువల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

బండిబాట ఆక్రమణ!

– దారిలేక లబోదిబోమంటున్న రైతన్నలు


పత్రాలను చూపిస్తున్న రైతు విజయ్ కుమార్ నాయుడు

రామచంద్రాపురం: బండిబాట దారి ఆక్రమణలకు గురికావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రావిళ్లవారిపల్లె పంచాయతీ బ్రాహ్మణ కాలువలో చోటు చేసుకుంది. రైతుల కథనం.. కేకేవీ పురం గ్రామ సర్వే లెక్క దాఖలాలో సర్వే నంబర్ 95/1, 95/2లో రైతులు కొన్నేళ్లుగా పొలాలకు వెళ్లేందుకు 20 అడుగుల వెడల్పు గల బండిబాటను ఉపయోగించుకుంటున్నారు. ఆ పొలాల వద్ద విశ్రాంత తహసీల్దార్ నాగార్జున రెడ్డి పొలాలు సైతం ఉన్నాయని, ఆయన దారిని సైతం కబ్జా చేసి తన పొలంలో కలుపుకున్నాడని, దీనిని అడ్డుకున్న రైతు విజయ్ కుమార్ నాయుడుతో పాటు ఇతర రైతులను తీవ్రత ఒత్తిళ్లకు గురి చేస్తున్నట్లు బాధితులు చెప్పారు. దీనిపై తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. తాము ఏ అధికారిని కలిసినా తమపై నిఘా పెట్టి నాగార్జున రెడ్డి కుమారుడు సునీల్ కుమార్ బెదిరిస్తున్నారని, వీరికి మండలంలో కొందరు టీడీపీ నాయకుల అండదండలు ఉన్నాయన్నారు. వీరి నుంచి తమకు ముప్పు పొంచి ఉందని, అధికారులు స్పందించి, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎస్వీయూ పచ్చదనం కోసం విరాళం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పచ్చదనం పెంపొందించేందుకు తిరుపతికి చెందిన యూనియన్ బ్యాంక్ విశ్రాంత సీనియర్ మేనేజర్ ఎమ్ఎస్ దామోదరం గుప్త తన మిత్రుడి జ్ఞాపకార్థం బుధవారం రూ.25వేల చెక్కును వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు అందజేశారు. పత్తికొండకు చెందిన తన మిత్రుడు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ కె.కాశీనాథ్ పిళ్లై 2022లో కన్నుమూశాడని, అతడి స్మారకార్థం ఈ విరాళమిచ్చినట్టు ఆయన చెప్పారు.

పేదలకు అల్పాహారం వితరణ


ప్రసూతి ఆసుపత్రి వద్ద పేదలకు అల్పాహారం వితరణ చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: డాక్టర్స్ డే వారోత్సవాల్లో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వద్ద గర్భిణుల సహాయకులకు, పేదలకు బుధవారం అల్పాహారం వితరణ చేశారు. తొలుత ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీల దేవిని సత్కరించారు. అనంతరం పేదలకు ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి బుధవారం దాతల సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ ఎం.భాస్కర్, కార్యదర్శి చక్రపాణి, కోశాధికారి పురుషోత్తం, ఉపాధ్యక్షుడు శంకర్, లయన్స్ లియో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూళ్ల కళాశాలలపై చర్యలు తీసుకోండి

– ఆర్‌ఐఓకు ఏపీ బీసీ విద్యార్థి సంఘం వినతి

తిరుపతి కల్చరల్: కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు నియమ నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు చేస్తున్న అక్రమ ఫీజులను నియంత్రించి సంబంధిత కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ గౌడ్ బుధవారం ఆర్‌ఐఓ రాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, తిరుపతిలో కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వివిధ రకాల కోర్సుల పేరుతో లక్షల్లో ఫీజులు వసూళ్లు చేస్తూ దోచుకుంటున్నాయని, అలాంటి కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నేత రాజశేఖర్ పాల్గొన్నారు.